ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

అతిసార విజృంభణ

- పాయకాపురంలో 15 రోజుల్లో ఇద్దరు మృతి
- 25 మందికి అస్వస్థత
- మొగల్రాజపురంలో మరో 4 కేసులు నమోదు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్, విజయవాడ : నగరంలో అతిసార మరో ప్రాంతానికి విస్తరించింది. 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, రాధానగర్ ప్రాంతాల్లో గత పదిహేను రోజుల్లో కలుషిత నీరు కారణంగా వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురై ఇద్దరు మరణించారు. అస్వస్థతకు గురైన 25 మంది వరకూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గత ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ తమరాపు సన్యాసమ్మ (80) మృతిచెందింది. అలాగే 15 రోజుల క్రితం యడ్లపల్లి వినయ్ సిద్ధార్థ (7 నెలలు) చనిపోయాడు. అస్వస్థతకు గురైన మహిళ డి.శివ దుర్గ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో, నైట్ శానిటేషన్ వర్కర్ సువ్వాడ వీరమ్మ ఆంధ్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడేళ్ల బాలిక పి.ద్వారకను గురువారం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వివిధ ఆస్పత్రుల్లో ఎ.సత్యవతి, కోడూరు రాజ్యలక్ష్మి, ఎ.హైమావతి అనే మహిళలు చికిత్స పొందారు. అలాగే మొగల్రాజపురంలో గురువారం మరో 4 అతిసార కేసులు నమోదైనట్లు జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి ప్రజాశక్తికి తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 60 కేసులు నమోదైనట్లు తెలిపారు.

సిపిఎం నేతల పరామర్శ

అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నట్లు పలువురు బాధితులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి తదితరులు పరామర్శించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు.... కలుషిత నీరు తాగి పలువురు అస్వస్థతకు గురైనట్లు నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని, బాధితులను ఆదుకోవాలని, కలుషిత నీటిని అరికట్టాలని, కష్ణ నది నుండి స్వచ్ఛమైన మంచినీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో ఎక్కడ చూసినా మంచినీటి కాలుష్యం కారణంగా అనేకమంది మరణిస్తున్నారని, వందలాది మంది ఆస్పత్రుల పాలువుతున్నారని అన్నారు. మరికొందరు స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఇళ్ల వద్ద ఉంటున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్నా పాలక పార్టీ ప్రజాప్రతినిధులుగానీ, అధికారులు గాని తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం తప్ప సరైన విధంగా స్పందించడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కె.దుర్గారావు, ఝాన్సీ, సిహెచ్. శ్రీనివాస్, సాంబి రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



64వ డివిజన్లో అతిసార బాధితురాలిని పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

నీరు కలుషితంపై వదంతులు నమ్మొద్దు

విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మొగల్రాజపురం, ఇతర ప్రాంతాల్లో మంచినీరు కలుషితమైనట్లు వస్తున్న అసత్యపు వదంతులను నమ్మొద్దని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి కలుషితంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలు, వార్తల పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నీటి సరఫరాకు కీలకమైన కష్ణా నది నీరు, బోర్‌వెల్స్ నీరు, ఓవరహెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లలో విస్తతంగా నిర్వహించిన నీటి నమూనా పరీక్షల్లో ఎక్కడా నీరు కలుషితం కాలేదని తేలిందని తెలిపారు.



మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

ఓట్ల లెక్కింపుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపునకు ఎవరైనా అవాంతరాలు కలిగిస్తే వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపుతామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. గురువారం ఆయన మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియా సెంటర్ లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ లతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ లెక్కింపు సమయంలో అభ్యర్థి లేదా వారి ఏజెంట్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కౌంటింగ్ హాల్ నుండి బయటకు పంపుతామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం ఎవరూ ఊరేగింపులు, ర్యాలీలు చేపట్టడానికి అనుమతులు లేవని, ఈ అంశాలపై జిల్లా ఎస్పీ ఇప్పటికే పలు సమావేశాల ద్వారా పోటీ చేసిన అభ్యర్థులకు అవగాహన కలిగించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కెయులో ఓట్ల లెక్కంపు కేంద్రం పరిశీలన

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. మచిలీపట్నం, గుడివాడ, పెడన, పామర్రు, అవనిగడ్డ, గన్నవరం, పెనమలూరు శాసనసభ నియోజకవర్గాలు, మచిలీపట్నం పార్లమెంటు అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ (మిగతా 2లో)

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

సిపి రామకృష్ణ

ప్రజాశక్తి-విజయవాడ : వచ్చే నెల 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా జరిగేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు సహకరించాలని విజయవాడ పోలీసు కమిషనర్ పిహెచ్‌డి రామకృష్ణ పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్‌ను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన సూచనలు, జాగ్రత్తలపై పోలీస్ కమీషనర్ స్థానిక పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికలలో పోటి చేసిన అభ్యర్థులు, వారి ప్రతినిధులతో పోలీసు కమిషనర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్.టి.ఆర్.జిల్లాలోని మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, ఈస్ట్, విజయవాడ పార్లమెంట్‌కు పోటీ చేసే ఆయా పార్టీల అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు 115 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ .కౌంటింగ్ కేంద్రాలు అయిన ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని నిమ్రా , నోవా కళాశాలలకు హాజరయ్యే అభ్యర్థులు, ఏజెంట్లు నేరుగా వారి సొంత వాహనాలలో రావడానికి వీలులేదని అన్నారు. వారి సొంత వాహనాలను కౌంటింగ్ సెంటర్ కు మూడు వైపులా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేసుకుని అక్కడ జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు ఎక్కి కౌంటింగ్ సెంటర్ కు రావాలన్నారు. దీనికి తగిన ఏర్పాట్లు చేసుకునేందుకు ఆయా పార్టీల (మిగతా 2లో)



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ పిహెచ్‌డి రామకృష్ణ



పతాకావిష్కరణలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, చిత్రంలో ఎన్‌సిహెచ్

కార్మికవర్గ రాజ్య స్థాపనే సిఐటియు లక్ష్యం

పతాకావిష్కరణలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - విజయవాడ : కార్మికవర్గ రాజ్య స్థాపనే సిఐటియు లక్ష్యమని, దానికోసం నిరంతరం పోరాడతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడ గవర్నర్‌పేటలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద యూనియన్ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయడంలో పాలక పార్టీలు విఫలమయ్యాయన్నారు. కేరళ ప్రభుత్వం అనేక ఏళ్లుగా అసంఘటిత, ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు (మిగతా 2లో)



వార్త 5లో

సూర్యుడు భగభగ...



జనం విలవిల





మాచవరం వాకర్స్‌లో సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబూరావు, నాయకులు జి.నటరాజు తదితరులు

మాచవరం వాకర్స్‌ను కలిసిన బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మాచవరం ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లోని వాకర్స్‌ను గురువారం ఉదయం సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సిహెచ్.బాబూరావు కలిసి ధన్యవాదాలు తెలిపారు. మాచవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై.సుబ్బారావు, మాజీ అధ్యక్షులు లంక జానయ్య, అసోసియేషన్ సభ్యులు తదితరులు బాబూరావుకు స్వాగతం పలికారు. అధ్యక్షులు సుబ్బారావు గ్రౌండ్‌లోని గ్రూపులు, గ్రూపులుగా ఎక్సర్సైజ్ చేస్తున్న వాకర్స్ వద్దకు తీసుకొని వెళ్లి బాబురావును పరిచయం చేశారు. ఈసందర్భంగా వాకర్స్‌లోని కొంతమంది మధ్య తరగతి ఉద్యోగులు మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు ప్రభావం కారణంగా నిత్యం ప్రజల్లో ఉండే అభ్యర్థులకు అవకాశం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో దామాషా విధానాన్ని తీసుకురావాలని తాము ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణ, జిల్లా కమిటీ సభ్యులు జి.నటరాజు, సిఐటియు నాయకులు వై.సుబ్బారావు, బి.లక్ష్మణరావు, కె.గురుమూర్తి, తాళ్లూరి నరసింహారావు, ఎస్‌కె.పీరు తదితరులు పాల్గొన్నారు.

గేమింగ్ జోన్, ఎగ్జిబిషన్లలో పూర్తి భద్రతా ప్రమాణాలు పాటించాలి : డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో గేమింగ్ జోన్స్, ఎగ్జిబిషన్లు తదితరాలు అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులు సంభవించకుండా నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఈనెల 25న ఓ గేమింగ్ జోన్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో అనేక మంది మరణించారు. ఈ ప్రమాదాల నివారణపై కార్యాచరణ తదితరాలపై కలెక్టర్ డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి గురువారం క్యాంపు కార్యాలయం నుంచి విసి నిర్వహించారు.

పెరుగుతున్న అతిసార కేసులు

కలుషిత నీరే కారణమంటున్న ప్రజలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో రోజురోజుకూ అతిసార కేసులు పెరుగుతూనే ఉన్నాయి. మొగల్రాజపురంలో గురువారం కూడా నాలుగు కేసులు నమోదయ్యాయి. ఎస్.కృష్ణకుమారి అనే మహిళకు స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్య సేవలందించారు. అల్లూరి పరమాత్మ వీధికి చెందిన పమిడిమర్రి సువర్ణను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇప్పటి వరకు రూ.80 వేలు ఖర్చు చేసినా ఆమె ఇంకా కోలుకోలేదు. ఇంకా అనేక మంది పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తూ పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గురువారం ఒక్క రోజే నాలుగు అతిసార కేసులు నమోదైనట్లు జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి ప్రజాశక్తికి తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 60 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఆర్ఎంపిల వద్దకు బాధితులు వెళ్లకుండా తగిన సూచనలు, జాగ్రత్తలు తీసుకోవాలని సిపిఎం నాయకులు మురహరి, జి.క్రాంతి తదితరులు డాక్టర్ ఉషారాణికి సూచించారు.

నీటి కాలుష్యమే కారణం : బాధితురాలి భర్త ఎస్.వెంకటరమణ



ఈ ప్రాంతంలో అతిసార విజృంభణకు కలుషిత నీరే కారణమని బాధితురాలు కృష్ణకుమారి భర్త ఎస్ వెంకటరమణ తెలిపారు. సున్నపు బట్టీల సెంటర్, మొగల్రాజపురం ఆటో స్టాండ్, సిపిఎం కార్యాలయం సమీపంలోని ఒక వీధిలో మంచినీటి పైప్‌లైన్లు పగిలిపోయి డ్రైనేజీ నీరు కూడా కలుస్తోందన్నారు. ఈ కలుషితమైన నీటిని తాగడం వల్లనే ప్రజలకు అతిసార సోకిందన్నారు. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు అతిసార బాధితులు ఉన్నారని తెలిపారు.

కమిషనర్ వ్యాఖ్యల్లో వాస్తవంలేదు : మృతుడు దుర్గారావు భార్య నాగమణి



తన భర్త వల్లూరి దుర్గారావు అతిసారతో కాకుండా పిట్స్ కారణంగా చనిపోయినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ మీడియాకు వెల్లడించారని, అయితే ఆయన వ్యాఖ్యల్లో వాస్తవంలేదని అతిసార మృతుడు దుర్గారావు భార్య నాగమణి తెలిపారు. ఈ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. తన భర్తకు పిట్స్ లేవని తెలిపారు. కాలు, చేయి ఔడని, గత శనివారం రాత్రి 10 గంటల సమయంలో వాంతులు, విరోచనాలతో తన భర్త నీరసించి ఉండటంతో మందులు ఇచ్చామని, ఆదివారం కూడా ఇబ్బందిగా ఉండటంతో డాక్టర్ వద్దకు తీసుకెళ్లి సెలైన్లు పెట్టించామని తెలిపారు. చివరకు ఆదివారం రాత్రి 10.30 గంటలకు మృతిచెందాడని తెలిపారు. దీంతో తాను, తన కుమారుడు ఆధారం కోల్పోయామని తెలిపారు. అధికారులు స్పందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

సమస్యను తక్కువ చేసి చూడడం సరికాదు
వెంకట్రావు, స్థానికుడు

సమస్యను తక్కువ చేసి చూడడం, ఏమీలేదన్నట్లుగా మాట్లాడటం శోచనీయమని స్థానిక నివాసి వెంకట్రావు అన్నారు. ఇప్పటికే నలుగురు మృతి చెంది, అనేక మంది బాధితులు ఆస్పత్రల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆస్పత్రులకు వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం కూడా ఒక కారణమని తెలిపారు.

హైదరాబాద్ 'ఇమ్టా'కు 28 నీటి నమూనాలు
అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ (ఎఎఫ్‌సి) షేక్ గౌస్‌మొహిద్దీన్



మొగల్రాజపురం ప్రాంతంలో పలు నీటి నమూనాలను హైదరాబాద్‌లోని 'ఇమ్టా' పరీక్షా కేంద్రానికి పంపామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ (ఎఎఫ్‌సి) షేక్ గౌస్‌మొహిద్దీన్ తెలిపారు. వాటి నివేదికపై మరో మూడు రోజుల్లో రావచ్చని తెలిపారు. స్థానికంగా తమ మొబైల్ వాహనం వద్ద మరో 108 నీటి నమూనాలను సేకరించామని తెలిపారు. ఐదారు రోజుల్లో వీటి పరీక్షా ఫలితాలు రావచ్చని వివరించారు.

క్లోరినేషన్ సరిగాలేదు : స్థానికులు

మొగల్రాజపురం ప్రాంతానికి పకీర్‌గూడెంలోని బోర్ ద్వారా వచ్చే నీటిని నిలుపుదల చేసి పలు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు కూడా పూర్తి స్థాయిలో శుద్ధి చేసినట్లు లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం పక్కన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నుంచి ట్యాంకర్ల ద్వారా మొగల్రాజపురం ప్రాంతానికి గత రెండు రోజుల నుంచి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అయితే హెడ్ వాటర్ వర్క్స్ వద్దనే క్లోరినేషన్ సరిగా కాకపోవడం, మట్టివాసనతో కూడిన నీటినే పైప్‌ల ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు సరఫరా చేయడం చేస్తున్నారు. తద్వారా స్టేడియం వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయినా క్లోరినేషన్ సరిగా లేక, శుద్ధి చేయడం అంతంతమాత్రంగానే ఉండి, ఒకరకమైన మట్టి వాసన వస్తుందని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



డ్రైనేజీలో గుండా వెళుతున్న మంచినీటి పైపులు

IN THE COURT OF PRINCIPAL CIVIL JUDGE
(JUNIOR DIVISION), NANDIGAMA

I.A. No: 481/2024 in O.S.No. 460/2021
Between:
Dondapati Rambabu ... Petitioner/ Plaintels
and
Pinapaka Hanumantha Rao (Died) & Others ... Respondents
To
Respondent No.5
బయ్యన వరలక్ష్మి W/o లేటు కృష్ణ
R/o గూడెం మాధవరం, వీరులపాడు మండలం, NTR జిల్లా
& Sciorl Hieghts Apartments, Plot No.503, Chintal, Hyderabad-500054.

పై నంబరు దావాలో ప్రతివాది యొక్క వారసురాలిగా మిమ్ములను చేర్చమని వాది పిటీషన్ దాఖలు చేసినందున, అందు విషయమై మీకు ఎట్టి ఆక్షేపణలున్న పై కోర్టువారి ఎదుట ది 19-06-2024వ తేదీన ఉదయం గం. 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరయి తెలుపుకోవలయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కోర్టువారి ఉత్తర్వులతో...

నందిగామ
ది. 30-5-2024

ఇట్లు
ఎన్. మల్లికార్జునరావు
పి. సుజాత
అడ్వకేట్స్, నందిగామ

మొదటిపేజీ తరువాయి

అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

రూములు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు గదులు, అక్కడ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటుచేసిన టేబుళ్లు, కుర్చీలు, ఆర్వోలు పరిశీలకుల టేబుళ్లు, కౌంటింగ్ ఏజెంట్ల పరిశీలన కోసం ఇనుప కడ్డీలతో మెష్ ఏర్పాటు, కుర్చీలు,ఈటీపీబిఎస్, ఎన్కోర్ కౌంటర్లు, కంపైలేషన్ విభాగాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల లాగ్ బుక్కులను తనిఖీ చేసి సీఈవో సంతకం చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు ఎలా జరుగుతుందో జిల్లా ఎన్నికల అధికారి సీఈఓకు వివరించారు. కేంద్రంలో నిరంతర విద్యుత్ అంతర్జాలం సరఫరా సజావుగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఈవో సూచించారు. అనంతరం సీఈవో అకాడమిక్ భవనం ఎదురుగా నూతన భవనాల్లో ఏర్పాటుచేసిన మీడియా సెంటరుకు పక్కనే స్ట్రాంగ్ రూముల పరిశీలన కోసం సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు పరిశీలించారు. ఈకార్యక్రమంలో సీఈఓ వెంట డిఆర్ఓ చంద్రశేఖర రావు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎం వాణి, పి పద్మావతి, పి వెంకటరమణ, శ్రీదేవి, జి బాలసుబ్రమణ్యం, డి రాజు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షాహిద్ బాబు, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడి మనిషా త్రిపాఠి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

అభ్యర్థులు వారి వారి ఏజెంట్లకు సూచనలు అందించాలన్నారు. జిల్లా యంత్రాంగం బస్సులను ఇబ్రహింపట్నం ఫెర్రీ వద్ద, కేతన కొండ వద్ద , వి.టి.పి.ఎస్. ఏ. కాలనీ వద్ద సిద్ధం చేస్తున్నారన్నారు. ఆ ప్రదేశాలలోనే పార్కింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తిరువూరు, మైలవరం వైపు నుండి వచ్చే అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు వి.టి.పి.ఎస్. ఏ. కాలనీ వద్ద, విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ నుండి వచ్చే వారు ఇబ్రహింపట్నం ఫెర్రీ వద్ద , నందిగామ జగ్గయ్యపేట వైపు నుండి వచ్చు వారు కేతన కొండ వద్ద పార్కింగ్‌ను ఉపయోగించుకుని అక్కడ నుండి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన బస్సులలో కౌంటింగ్ సెంటర్ కు చేరాలన్నారు.సెక్షన్ 144 సి.ఆర్.పి.సి, సెక్షన్ 30పోలీస్ యాక్ట్ ఉన్నందున, రెడ్ జోన్ గా ప్రకటించామని, ఆయా ప్రాంతాల ప్రజలు, కార్యకర్తలు, గుమిగూడి ఉండటాన్ని నిషేధించామని అన్నారు. అభ్యర్థులు ఏజెంట్లు పాస్‌లను జిల్లా యంత్రాంగం వద్ద పొందాలని, అదేవిధంగా వాహనాలకు సంబంధించిన పాస్ లను తీసుకోవాలని కోరారు. మూడు డ్రోన్ కెమెరాలతో నిఘా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.. జిల్లాలో పోలీస్ వారి 1500 సి.సి.కెమెరాలు, ఇతరుల 3000 సి.సి.కెమెరాలను, కౌంటింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలలో150 సి.సి.కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ సెంటర్ సమీపంలోని నివాసితులకు బయట నుండి వచ్చే వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వద్దని కోరారు. కౌంటింగ్ జరిగే రోజు వచ్చే నెల 4వ తేదీ ఉదయం 06.00 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు.కౌంటింగ్ కేంద్రానికి వచ్చు ఏజెంట్లు కలెక్టర్/ఆర్.ఓ.ఇచ్చిన ఐ.డి.కార్డు కలిగి ఉండాలన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిసిపిలు కె.శ్రీనివాసరావు, అధిరాజ్ సింగ్ రాణా, టి.హరికష్ణ, కె.చక్రవర్తి, ఎడిసిపిలు, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికవర్గ రాజ్యస్థాపనే సిఐటియు లక్ష్యం

మారినా అసంఘటిత కార్మికుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, బీమా సదుపాయాలు కల్పించాలని కోరారు. అసంఘటిత కార్మికుల శ్రమ ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు నూటికి 60 శాతం ఆదాయం వస్తోందన్నారు. ఈ ఆదాయంలో కనీసం రెండు శాతం నిధులను కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టాలన్నారు. ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ విజయవాడ మోటారు వెహికల్ యాక్సిడెంట్స్ ట్రిబ్యునల్ మరియు 7వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో
M.V.O.P. No. 175/2021

బిట్వీన్ :
మల్లాది నాగ వెంకట రఘుబాబు
... క్లయిమెంట్ - పిటీషనర్
మరియు
పులివర్తి మనోరంజిత వగైరా.... రెస్పాండెంటు

నోటీసు 1వ ప్రతివాది- రెస్పాండెంటు నెం.1 మరియు వారి చిరునామా వారికి

పులివర్తి మనోరంజిత, తండ్రి : హనుమంతరావు, 502, శ్రీదేవి రెసిడెన్సీ, మహానాడురోడ్డు, కేశినేని అడ్మినిస్ట్రేషన్ ఆఫీసు వద్ద, జి-స్క్వేర్ హోటల్ దగ్గర, గణేష్‌నగర్ కాలనీ, విజయవాడ.

పైన చెప్పిన 1వ ప్రతివాది పులివర్తి మనోరంజిత గారికి సదరు ఎం.వి.ఓ.పి. 175/2021 పిటీషన్‌లో కోర్టుద్వారా సమన్లు పంపిననూ తీసుకొనకకాలయాపన చేస్తున్నందున కోర్టువారి ఉత్తర్వులననుసరించి నోటీసు ఈ పత్రిక ద్వారా (ప్రజాశక్తి దినపత్రిక) పత్రికా ప్రకటన ద్వారా జారీ చేయుటకు మరియు పైన చెప్పిన ఎం.వి.ఓ.పి. 175/2021 నోటీసు జారీ చేయు నిమిత్తం ది. 14-6-2024 వాయిదా వేసినారు. కనుక 1వ వాది పులివర్తి మనోరంజిత గారు ది. 14-6-2024 నోటీసు నిమిత్తం వాయిదా వేసినారు. మీరు ది. 14-6-2024న ఉదయం 10-30 గం.లకు సదరు పైన తెలిపిన కోర్టులో ప్రత్యక్షముగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై తమరి అభ్యంతరములు తెలుపుకొన వలెను. లేనిచో పరోక్షముగా తీర్మానించబడునని తెలియపర్చడ మైనది.

(కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

విజయవాడ.
ది.30-5-2024

ఇట్లు
కె.శ్రీరామమూర్తి,
అడ్వకేట్,
గాంధీనగర్, విజయవాడ.
సెల్ : 9246473270.

IN THE COURT OF THE ADDL. SR. CIVIL JUDGE,;TENALI.
O.S. No. 106/1984 in
IA 265/2001, in IA 662/2022 in IA 19/2024
(final Decree Procedings)

Between :
S.V.Rama Chandra Murthy (died) & others .... Petitioners / Plaintiffs
Vrs.
D.Uma Maheswara Rao (died) & Others .... Respondents/ Defendents

To, **R24 :** శ్రీమతి పటేల్‌ఖాన్ సుశీల, W/o లేటు పటేల్ ఖాన్ బాల గంగాధరరావు, C/o డా॥ ప్రభాకర్, R/o D.No.7/297, సర్వస్ట్రీట్, గొడుగుపేట, మచిలీపట్నం, కృష్ణాజిల్లా.

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్లు ఓ.యపస్.నెం. 106/1984 దాఖలా ప్రిలిమినరీ డిక్రీని అనుసరించి ఫైనల్ డిక్రీని ఇప్పించవలసినదిగా కోరుతూ పై నెంబరు ఐ.ఎ. 265/2001ను దాఖలు చేసి వున్నారు. సదరు పిటీషన్‌లో మీ భర్తగారిని వారసులుగా చేర్చు నిమిత్తం ఐ.ఎ. 662/2022 దాఖలు చేయబడగా మీ భర్త గారికి పై కోర్టువారు నోటీసు ఆర్డరు వేయగా, నోటీసు పంపించి వుంటిమి. అందులో మీ భర్తగారు చనిపోయి నారని శ్రీ కోర్టువారికి సదరు నోటీసు ద్వారా తెలిసినది. అందులకు ఆర్22 పటేల్‌ఖాన్ బాల గంగాధరరావు గారి భార్యను మరియు వారసులు మీరే కనుక మీకు పై కోర్టు నుండి ఐ.ఎ. 19/2024 అను పిటీషన్ కాపీలతో ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసు కొనక కాలయాపన చేయుచున్నం దున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా యీ నెంబరు పిటీషన్ ది. 22-6-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి వున్నది. ది. 22-6-2024 వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ వాదనలు దస్తావేజులతో సహా తెలియజేసుకొన వలసినదిగా తెలపటమైనది. లేనిచో మీ పరోక్షమున యీ నెంబరు పిటీషన్ విచారణ జరిపి శ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీ చేయబడునని తెలియజేయటమైనది.

వాయిదాతేది : 22-6-2024
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
వెల్లంకి విశ్వేశ్వర శాస్త్రి,
పిటీషనర్ తరపు న్యాయవాది,
నాజరుపేట, తెనాలి.
సెల్ : 7799300284.

రెడ్‌జోన్‌లో కౌంటింగ్ కేంద్రాలు : ఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కౌంటింగ్ కేంద్ర ప్రాంతం చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్‌గా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి స్పష్టం చేశారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగనున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధి ని రెడ్ జోన్ గా పరిగణస్తూ జిల్లా కలక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని కాబట్టి ఆ ప్రదేశాలలో అనధికారికంగా ఎటువంటి అనుమతులు లేకుండా బయట వ్యక్తులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు అసంఖ్యాకంగా గుమి గూడటం, అటు




ఇటూ సంచరించడం నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు.అంతేకాకుండా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రెడ్ జోన్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు ఎగరవేయటం నిషేధమన్నారు. ఈ నిషేధం.నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలీసువారి ఆదేశాలను మీరి డ్రోన్లను ఎగరవేసిన వారిపై ఈ కింది సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నిషేధాజ్ఞలు జూన్ 10 తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు జిల్లా ప్రజలు, రాజకీయ నాయకులు ప్రతిఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈసెట్లో గుడ్లవల్లేరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

ఎపి ఈసెట్ ఫలితాల్లో గుడ్లవల్లేరు ఎఎఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్









విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. 10 లోపు మొత్తం 13 రాష్ట్రస్థాయి ర్యాంకులు, 100 లోపు మొత్తం 62 రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో వందలోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు అందరూ వారి ఇష్టం మేరకు వివధ రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలలో లేదా పేరెన్నిక గల ఇంజనీరింగ్ కాలేజీల్లో వారి బీటెక్ విద్యను అతి తక్కువ వ్యయంతో మూడు సంవత్సరాలు పాటు అభ్యసిస్తారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు వల్లూరిపల్లి, సెక్రెటరీ కరస్పాండెంట్ సత్యనారాయణరావు, కో సెక్రెటరీ అండ్ అండ్ కరస్పాండెంట్ వి.రామకృష్ణ, ప్రెసిడెంట్ వి.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ కొడాలి వెంకటకృష్ణారావు తదితరులు అభినందించారు.





వికలాంగ బాలల గుర్తింపు

ప్రజాశక్తి-గన్నవరం: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బడి బయట ఉన్న వికలాంగ బాలలను ఒకటో తేదీ శనివారం నుంచి గుర్తించనున్నట్లు ఎంఇఒ-2 కమల తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలో నూతనంగా ఆరుగురిని బడి బయట ఉన్న ఆరుగురిని గుర్తించడం జరిగిందన్నారు. మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. వీరిలో అవసరమైన వారిని భవిత కేంద్రంలోనూ మిగిలిన వారిని వారికి తగిన పాఠశాలలో లేదా కళాశాలలో జాయిన్ చేయడం జరుగుతుందన్నారు. భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ,ఫిజియోథెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్, ఎర్లీ ఇంటర్వెన్షన్ మొదలైన కార్యక్రమాల ద్వారా పిల్లల వైకల్యం పెరగకుండా చూసి మీరందరికి స్కూల్ రెడీనెస్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక శిక్షణను ఇచ్చి తదుపరి



ప్రధాన స్రవంతి పాఠశాలలో జాయిన్ చేయడం జరుగుతుందని చెప్పారు. మండలంలో అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, రోలేటర్స్, వీల్ చైర్స్ వంటి పరికరాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు.మండలంలో ఇంకా ఎవరైనా ప్రత్యేక అవసరాలు గల బాలలు ఉన్నట్లయితే 9848464352, 8142517787 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



సబ్సిడీపై వరి విత్తనాలు

ప్రజాశక్తి-ఉంగుటూరు: రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి వివి ఎస్ హరీష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రం లోని రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ ధరకు విత్తనాలు రైతులకు అందించిన హరీష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎంటియు 1328 రకం మరియు ఎంటియు 1061 విత్తనాలు సరఫరాకు సిద్దంగా ఉన్నాయి అని అన్నారు. 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.1194 కాగా ప్రభుత్వం కిలో విత్తనాలకు రూ.5 సబ్సిడీ ఇస్తుందన్నారు. 30 కిలోల బస్తాకు రూ.150 సబ్సిడీ లబిస్తుందని అన్నారు. ప్రస్తుతం ఉంగుటూరు, ఆత్కూరు రైతు భరోసా కేంద్రాల్లో ఎంటియు 1318 రకం 120 క్వింటాళ్ళు మరియు ఎంటియు 1061 రకం 60 క్వింటాళ్లు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగతా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు కూడా ఇంకా 230 క్వింటాళ్లు విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు తమ పొలం పాస్ బుక్ జిరాక్స్ మరియు అధార్ జిరాక్స్ తీసుకుని ఆర్‌బికె సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఆయుష్‌లో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గూడవల్లి ప్రభుత్వ ఆయుష్ హాస్పటల్లో ప్రతిరోజు వివిధ రకాల రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని డాక్టర్ పాపినేని మల్లిక్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీపీ, షుగర్, డెంగ్యూ, మలేరియా, థైపాయిడ్, ఆస్మా, ఆయాసం తదితర రోగాలకు వైద్యం అందిచనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9849654641 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జనరల్ సెక్రటరీగా త్యాగరాజు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ఎపి ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా బుల్లా త్యాగరాజు(కింగ్) నియమితులయ్యారు. ఈ నియామకపు పత్రాన్ని చైర్మన్ బుల్లా రాజారావు విజయవాడలో గురువారం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి ద్వారా ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్స్, డప్పు కళాకారులకు, చర్మ కళాకారులకు, స్వయం ఉపాధి ద్వారా సభ్యులు అందరితో కలిసి లబ్ధి చేకూర్చే విధంగా న్యాయ బద్ధమైన పోరాటం చేస్తానని అన్నారు.



ఫ్రూట్ హాకర్స్‌కు బీమా పాలసీ

ప్రజాశక్తి-గుడివాడ: పట్టణంలోని ఫ్రూట్స్ హాకర్స్‌కు జివిఆర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పాలసీని అందజేశారు. గురువారం పట్టణంలోని ఫ్రూట్స్ హాకర్స్, చిన్న కార్లు స్టాండ్ లోని డ్రైవర్లందరికీ పథక పాలసీ ఉచిత నమోదు కార్యక్రమాన్ని జివిఆర్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గోకరకొండ బలరాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి గోకరకొండ వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం జివిఆర్ వెల్ఫేర్ సొసైటీ నెలకొల్పి 25 ఏళ్లుగా తన శక్తి మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా 200 మంది ఫ్రూట్స్ హాకర్స్, 50 మంది ట్యాక్సీ డ్రైవర్లకు రూ.1.12 లక్షల పాలసీని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ టిడిపి నాయకులు నెరుసు చింతయ్య, పంద్రారాజు సాంబయ్య, పండ్లవర్తక సంఘ నాయకులు పెద్ది రమణ, పెద్ది కిషోర్, అప్పన్న, పోస్టల్ శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-బంటుమిల్లి: 2004-05 కాలంలో పది పరీక్షలు పూర్తి చేసుకొని అనంతరం వేర్వేరు చోట్ల స్థిరపడ్డ బంటుమిల్లి మండలం చౌరంపూడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇరవై సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి హెడ్ మాస్టర్ రాధా కృష్ణకుమారికి, అధ్యాపకులు రుక్మాంగద రెడ్డి, జల్లా అప్పారావు, లక్ష్మి నాంచారమ, పద్మావతి, ఝన్సీరాణి, వల్లబు ఏడుకొండలు, కొల్లాటి రామకృష్ణ, దాసరి నాంచారయ్య తదితరులను ఘనంగా సన్మానించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని ఉంగుటూరు ఎస్ఐ వి.రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడిన రవీంద్ర కుమార్ రానున్న 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగుతోంది అని ఈ నేపథ్యంలో ఉంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు మరియు ముఖ్యంగా యువత సంయమనంతో వ్యవహరించాలని, కుల, మత, వర్గ ప్రాంతాల పేరుతో వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దాని ద్వారా యువతకు తమ ఉజ్వల భవిష్యత్తు కు విఘాతం కలుగుతుందని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వివాదాస్పద వ్యాఖ్యలకు వివాదాలకు దూరంగా ఉండాలి అని అన్నారు. దీనిని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని దాని ద్వారా మీరు చదువుతున్న, చదువుకున్న చదువులు నిరుపయోగం మై ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయి భవిష్యత్ నిర్వీర్యం అయి జీవితం అగమ్యగోచరంగా మారుతుంది అని అన్నారు. దీనిని గమనంలో ఉంచుకుని సమాచార మాధ్యమాల్లో సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన చర్యలకు గురవుతారని హెచ్చరించారు.



రెండు పూటల పనిని రద్దు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్

ప్రజాశక్తి-ఉంగుటూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తేలప్రోలు, ఆత్కూరు గ్రామాలలో ఉపాధి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పని కొన్ని ప్రాంతాలలో రెండు పూటలా చేయిస్తున్నారని, ఇది సరి కాదని దీనిని రద్దు చేయాలని అన్నారు. పలుగు, పార సాన పెట్టడానికి తట్ట కొనుగోలుకు, మంచినీళ్లకు నగదు చెల్లింపులు జరగడం లేదని దానిని వెంటనే పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా వివాహం చేసుకున్న వారికి ప్రత్యేకంగా జాబ్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా రోజు కూలీ కనీసంగా రూ.600 ఇవ్వాలని డిమాండ్



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

చేశారు. ప్రతి కుటుంబానికి రెండు వందల రోజుల పని కల్పించాలని కోరారు, పంట కాలువలో గుర్రపు డెక్క, నాచు తొలగించడం, కచ్చా డ్రెయిన్, జంగిల్ క్లియరెన్స్ లాంటి పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న నాగరాజు

ఉపాధి కార్మికుల సమస్యల పరిశీలన

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు గురువారం పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలుపన్నుతుందని కార్పొరేట్లకు లక్షల కోట్లు దోచిపెడుతూ కార్మికులకు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. రెండు పూటల పని విధానం రెండు ఫొటోలు విధానాన్ని రద్దు చేయాలని 200 రోజులు పని దినాలు కల్పించి 600 కనీస వేతనం ఉపాధి కార్మికులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో చల్లదనానికి, రక్షణకు

ఇవి పాటిస్తే మంచిది

ప్రజాశక్తి - వత్సవాయి : వేసవిలో అధికంగా నీరు తాగటం, కొబ్బరి బొండాలు, పుచ్చకాయ ముక్కలు, పండ్ల రసాలు లాంటి శీతల పానీయాలు, సేవించడం ద్వారా వేసవి బారి నుండి తప్పించుకోవచ్చని, వేసవిలో చర్మ వ్యాధుల నుండి కాపాడుకోవచ్చని కొన్ని నియమాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని చర్మ వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా, చర్మ వ్యాధులు బారిన పడకుండా పూర్వికులు కొన్ని ఆచారాల పాటించేవారు కానీ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో వాటిని పాటించడం లేదు. అందువల్ల వేసవిలో తరచు వడదెబ్బకు గురికావడం జరుగుతుంది. కొంతమంది చర్మ వ్యాధుల బారిన కూడా పడుతున్నారు. ఇందుకోసం ముఖ్యంగా వేసవిలో చర్మం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఉష్ణోగ్రత పెరిగినకొద్దీ చర్మానికి కూడా ఇబ్బందులు మొదలవుతాయి. శరీరంలో బయటికి పంపించడం చర్మం చేసే ముఖ్యమైన విధుల్లో ఒకటి, శరీర లోపల మెలానిన్ అనే పిగ్మెంటు అల్ట్రా వయోలెట్ కిరణాలను భరించలేదు. దీని కారణంగా దీని యువిఎ, యువిసి చర్మ వ్యాధులు వస్తాయి. యువి అనే చర్మ వ్యాధి వల్ల హాని ఉండదు. ఎండలో బయటకు వెళ్లే సమయంలో చెవులను కప్పుకోవాలి. తలపాగా చుట్టుకోవాలి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు కూడా ఈ విధానం పాటిస్తే చాలా మంచిది. రైతులు ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మద్యపానం పనులు చేయకూడదు. ఈ సమయాన్ని అందరూ పాటించటం ఉత్తమం. ఈ సమయాల్లోనే పట్టణాల్లో నగరాల్లో ఉద్యోగులకు పని ఎక్కువగా ఉంటుంది. యూవిఎ కిరణాలు మధ్యాహ్నం సమయంలో ఎక్కువగా ఉంటాయి. ఈ కిరణాలకు అందరి శరీరం తట్టుకోలేదు. చర్మం ఎప్పుడు చల్లగా ఉండాలంటే కచ్చితంగా రోజుకు 250 మిల్లీ లీటర్ల చొప్పున 12 సార్లు కుండలో నీరు తాగాలి. పాలు, పండ్లు రసాలు తాగటం శరీరానికి మంచిది. పాలను శరీరానికి పట్టించవచ్చు. తెల్లటి వస్త్రాలు ధరించడం మంచిది ఎండాకాలంలో ఒకటిసార్లు కంటే స్నానం చేయటం మంచిది. ఎండలో తిరిగి వచ్చినప్పుడల్లా ముఖాన్ని నీళ్లతో శుభ్రంగా చేసుకోవాలి. శరీరం పేలినట్లు కనిపిస్తే పరిశుభ్రమైన నీటితో స్నానం చేయాలి. వైద్యుల సలహా మేరకు అన్ని రకాల పౌడర్లు వాడుకోవాలి సన్ ప్రొటెక్టివ్ లోషన్‌ను వినియోగించుకోవాలి' అంటూ వైద్య నిపుణులు సూచనలిస్తున్నారు.



విత్తన కంపెనీల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విత్తన విక్రేతలు కృత్రిమ కొరత సృష్టించి విత్తనాలను రైతులకు అధిక ధరకు అమ్మటం, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గయ్యపేట వ్యవసాయ శాఖ ఏడి భవాని హెచ్చరించారు. పట్టణంలోని విత్తన షాపులను గురువారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ జగ్గయ్యపేట సబ్ డివిజన్‌లో గత సంవత్సరం 15,000 ఎకరాల్లో పత్తి సాగు చేశారని, ఈ ఖరీఫ్ సీజన్‌లో 20వేల ఎకరాలలో పత్తి పంట సాగు అవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేట సబ్ డివిజన్ పరిధిలో 20 ఎకరాలకు గానూ 40 వేల ప్యాకెట్లు అవసరం అవుతుందని ఇప్పటికి 55,000 ప్యాకెట్లను లైసెన్స్ కలిగిన విత్తన విక్రయ దుకాణాల వద్ద అందుబాటులో ఉన్నాయని, రాబోయే పది రోజుల్లో మరో 15,000 నుండి 20 వేల ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. పత్తిలో 99 శాతం బీటీ వితనాలు కాగా అందుబాటులో ఉన్న వివిధ కంపెనీలకు సంబంధించిన హైబ్రిడ్ విత్తనాలు అధిక దిగుబడి సామర్థ్యం కలిగినవి అన్నారు. పత్తి పంటలో విత్తనం రకం కంటే కూడా సాగు పద్ధతులపై దిగుబడులు అధికంగా ఆధారపడి ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అవసరం కంటే కూడా అధిక మొత్తంలో విత్తనాలు అందుబాటులో ఉన్న రైతుల అపోహ కారణంగా ఒకటి రెండు విత్తన రకాల మాత్రమే ఎక్కువ మొత్తంలో అమ్మకాలు జరిగినవి అన్నారు. భూమి ప్రస్తుత వాతావరణం పరిస్థితులలో ఉష్ణోగ్రత కారణంగా విత్తనం మొలక శాతం దెబ్బతింటున్న కారణంగా రైతులు తొందరపడి విత్తనాలు విత్తకుండా తగినంత తేమ శాతం ఉన్నప్పుడు విత్తుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సర్వేతో వికలాంగుల భవితకు బాట



సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయురాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) పిల్లల పాఠశాల నమోదు కార్యక్రమాన్ని మే 1వ తేదీ నుండి ప్రారంభించారు. ఈ సర్వే జూన్ 9 వరకు జరుగుతుందని తెలిపారు. మండలంలో విద్యా వనరుల ఉపాధ్యాయులు డి.ఉదయలక్ష్మి, డి.జానకి ఈ సర్వే ద్వారా వికలాంగులను గుర్తించి పాఠశాలలో చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సర్వే ద్వారా వినికిడి లోపం, మాటలు రాకపోవడం, అంధత్వం, బుద్ధిమాంద్యత, ఆటిజం వంటి 21 రకాల శారీరక మానసిక వైకల్యాలు గల పిల్లలను గుర్తించి చిల్లకల్లు భవితా సెంటర్‌లో లేదా పాఠశాలలో చేర్పించడం జరుగుతుంది. భవిత సెంటర్ల ద్వారా అందజేస్తున్న స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, వ్యక్తిత్వ వికాసం వంటి శిక్షణలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలకు రాలేని తీవ్ర వైకల్యం గల పిల్లలకు ప్రతి శనివారం ఇంటి వద్ద శిక్షణ అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. సమగ్ర శిక్షణ ద్వారా నడుపబడుతున్న ఈ భవిత కేంద్రాల్లో విద్యనభ్యసించే పిల్లలకు పలు అలవెన్సులు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందచేస్తోంది. వైకల్యాన్ని అధిగమించే నిమిత్తం అవసరమైన ఉపకరణాలు బోధన అభ్యాసన సామాగ్రిని అసెస్మెంట్ క్యాంపుల నిర్వహణ ద్వారా అందజేస్తున్నారు. అంగన్వాడీ, ఏఎన్ఎం, ఆశ, సచివాలయ సిబ్బంది సాయంతో ఇంటింటికి సర్వేను నిర్వహిస్తున్నారు. జిల్లా మొత్తం మీద ఇలాంటి 20 భవిత సెంటర్లున్నాయి. జగ్గయ్యపేట మార్కండేయ బజార్‌లో గల దుడకా సీతామహాలక్ష్మి అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించారు.

సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి

వైసీపీ సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్

ప్రజాశక్తి - భవానీపురం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మే 30న తన పదవీకాలం ఐదేళ్లు సంపూర్ణంగా పూర్తి చేసుకున్నందుకు వైసిపి సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాజకీయాలు చూడకుండా ప్రతి కుటుంబానికీ మంచి చేసిందన్నారు. ప్రజలందరి దీవెనలతో మళ్లీ ఏర్పాటుకానున్న ప్రభుత్వం ఇదే అన్నారు.

వంటల పోటీలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ ఎంఆర్‌సిలో సిసిహెచ్‌లకు శిక్షణ మధ్యాహ్నం వంటల పోటీలు ఎంఈఓ ఎం పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో 29 పాఠశాలలు పాల్గొన్నాయి. ఎంపియుపి స్కూల్ చందాపురానికి ప్రథమ బహుమతి సాధించింది. ఎంఈఓ చేతుల మీదుగా ఎండిఎం కుక్ బి.పద్మకు బహుమతి ప్రదానం చేసినట్లు హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : వాసవి క్లబ్స్ తిరువూరు కమిటీ సభ్యులు వేసవికాలంలో బాటసారుల దాహాన్ని తీర్చటం అభినందనీయమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొత్త గుండ్ల ప్రసాదరావు అన్నారు. తిరువూరు జైభవి సెంటర్‌లో 60 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాసవీ క్లబ్ ముందుగా రావటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు నాళ్ళ కష్టారావు, నాళ్ళ.వెంకట రామారావు, సూర్యప్రకాశరావు, గుడిమెట్ల సుబ్బారావు, ముత్యాల నాగేశ్వరరావు, గుర్రం పవన్ కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న శ్రీరాం తాతయ్య

పలువురికి పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని పలువురు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని జగ్గయ్యపేట నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) గురువారం పరామర్శించారు. చిల్లకల్లు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తాళ్లూరి శివపార్వతి అనారోగ్యంతో బాధపడుతూ ఈ మధ్యకాలంలో హాస్పటల్లో వైద్యం చేయించుకుని డిశ్చార్జ్ అయినారు. బీసీ కాలనీకి చెందిన చల్లా నరసింహారావుకి కాలు ఫ్రాక్చర్ అయింది. గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన జిల్లపల్లి రాంబాబు అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ అనంతరం డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకొని తాతయ్య బుధవారం రాత్రి వారి గృహాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

నందిగామ ఫలితం 4 గంటల్లోనే !

పురుషుల కంటే మహిళా ఓటర్లు కీలకం



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గం అసెంబ్లీ ఫలితం 4 గంటలలోనే తేలనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఉమ్మడి కష్ణా జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్టీఆర్ జిల్లాలో తొలి ఫలితం నందిగామ నుంచి రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 4 గంటల్లోనే ఇక్కడ విజేత ఎవరో తేలిపోనుంది. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి నిమ్రా, నోవా కాలేజీల్లో లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే. అయితే నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం లో విజేతను నిర్ణయించడంలో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. మే13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరుగగా నందిగామ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పురుషుల కంటే అధికంగా మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గంలో 2,05,480 మంది ఓటర్లు ఉండగా 1,79,952 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 87.58 శాతం పోలింగ్ నమ్మైదైంది. పురుషులు 87,769, మహిళలు 92,179 , థర్డ్ జెండర్స్ నలుగురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే 4,410 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు వున్నాయి. నందిగామ పట్టణంలో 14,118 మంది పురుషులు ఓట్లు వేయగా, 14,973 మంది మహిళలు ఓట్లు వేశారు. నందిగామ మండలంలో 10,456 మంది ఓట్లు వేయగా, మహిళలు 10,963 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కంచికచర్ల మండలం లో 23,961 మంది పురుషులు ఓటు వేయగా, 25,526 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరులపాడు మండలంలో 17,448 మంది పురుషులు ఓట్లు వేయగా, 18,499 మంది మహిళలు, చందర్లపాడు మండలంలో పురుషులు 21,485 మంది, మహిళలు 22,182 మంది, నందిగామ పట్టణంతో పాటు అన్ని మండలాల్లో పురుషుల కంటే మహిళలే ఓటు హక్కు వినియోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గం లో 222 పోలింగ్ కేంద్రాలు వుండగా, 161పోలింగ్ కేంద్రాలలో మహిళలు, పురుషులు కంటే ఎక్కువగా తమ ఓటు హక్కు వినియ్యోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గంలో పురుషులు కంటే మహిళలు ఎక్కువగా ఓట్లు వేయటంతో తీర్పు ఏలా ఉంటుందో నని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. జూన్ 4వ తేదీ కోసం అందరు వేసి చూస్తున్నారు.


గన్నవరంలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



సూర్యుడు భగభగ... జనం విలవిల



• నిర్మానుష్యంగా రహదారులు • కార్మికులపై ప్రభావం

ప్రజాశక్తి-విజయవాడ

భగభగ మండే ఎండలకు ప్రజలు అల్లాడిపోయారు. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో గురువారం సాయంత్రం ఆరు గంటల తరువాత కూడా వేడి గాలులు, ఉక్కతీతకు ప్రజలు అల్లాడిపోయారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, పొలాల్లో పని చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పశువులు, పక్షులకు అందుబాటులో నీరు లేక నీరసించి పోయాయి. మండిపోతున్న ఎండలు, వడగాలులకు తల్లడిల్లారు. ఎప్పుడూ జనంతో రద్దీగా ఉండే ఎంజి రోడ్డు, కారల్ మార్క్స్ రోడ్డు, బెంజి సర్కిల్, కాళేశ్వరరావు మార్కెట్ తదితర ఏరియాల్లో మధ్యాహ్నం సమయములో నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. రహదారులు బోసిపోయాయి. ఇటీవల కాలంలో ఇటువంటి ఎండల తీవ్రత ఎదరు కాలేదని నగర వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. నిన్నమొన్నటి వరకు వరకు తేలికపాటి వర్షాలు, కొంత చల్లబడిన వాతావరణంతో ప్రజలు ఉపశమనం పొంది, ఇక ఎండల ప్రభావం తగ్గుముఖంపట్టినట్లేనని భావిస్తున్న నేపథ్యంలో గురువారం సూర్యుడు ఒక్క సారిగా ప్రతాపం చూపించాడు. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ మధ్యాహ్నానికి ఎండకు తట్టుకోలేని పరిస్థితి ప్రజలకు ఎదురయింది. భగభగ మండుతూ...పొగ సెగలకు సగటు మనిషి అల్లాడిపోయాడు. గాలిలో తేమ శాతం తగ్గిపోయి, ఎండకు ప్రజలు అల్లాడిపోయారు. ముఖ్యంగా కాయకష్టం చేసే కష్టజీవులు తట్టుకోలేని పరిస్థితి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద (ఎన్ఆర్ఇజిఎస్) వివిధ పనులు చేసే కూలీలు ఎండ తీవ్రతకు కలవరించే విధంగా "అబ్బో ఎండ ప్రభావం తీవ్రంగా ఉందే" అన్నట్టుగా కార్మికులు అల్లాడిపోయారు. అలాగే భవన నిర్మాణ కార్మికులు, హాకర్స్, చిరు వ్యాపారులు, అసంఘటిత కార్మికులు (రిక్షా, ఆటో, ముఠా, ఇతర రంగాల్లో పని చేస్తున్న కార్మికవర్గం)లపై ఎండల ప్రతాపానికి తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఎన్ఆర్జిఎస్ కూలీలకు పని చేసే ప్రదేశాల్లో సరైన నీడ, మంచినీటి వసతి లేక ఎండల్లోనే పనులు చేయక తప్పలేదు. అలాగే భవన నిర్మాణ కార్మికులు కూడా ఎండలకు పనులు చేయలేకపోయారు. బీసెంట్ రోడ్డు, కాళేశ్వరరావు మార్కెట్, కలెక్టరేట్ ఏరియా, రైతు బజార్లు, మ్యాంగో మార్కెట్ తదితర ఏరియాల్లోని హాకర్స్, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు మండే ఎండలకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వీధుల్లో శానిటేషన్ పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు మధ్యాహ్నం వరకు కూడా పనిలో ఉండటంతో నీరశించి పోయారు. సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు మధ్యాహ్నం సమయములో వారి వారి ఇళ్లకు ఎండల్లోనే చేరుకోవాల్సి రావడంతో విద్యార్థినీ విద్యార్థులు తల్లడిల్లిపోయారు. వన్‌టౌన్, ఇతర ప్రాంతాల్లోని ఇరుకైన ఇళ్లల్లో నివాసాలుండే వారు, రేకులిండ్లు తదితర గృహాల్లో మధ్యాహ్నం సమయములో ఉండలేక, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఊబకాయం కల్గిన వారు, ఉబ్బసం వ్యాధుల వారికి ఈ ఎండలకు ఊపిరి పీల్చుకోలేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఇలాగే ఎండ వేడిమితో వాతావరణం రెండు, మూడు రోజుల పాటు ఉంటే వృద్ధులు, సీరియస్ వ్యాధి గ్రస్తులు బతకడం కష్టం అనేంత రీతిలో ఎండ ప్రజలను దెబ్బతీసింది. ఆయా రంగాల్లోని ప్రజలు తీవ్ర కష్టాలు పడ్డారు. ఇళ్లల్లో ఏసిలు కూడా ఎండ తీవ్రతకు పని చేయక, ఉక్కతీతతో చిన్నారులు, వృద్ధులు, హృద్రోగ వ్యాధి గ్రస్తులు అల్లాడారు. విద్యుత్ అంతరాయంతో ఏసీలు, కూలర్లు పని చేయక కార్యాలయాల్లో పని చేసే వారికీ కూడా ఇక్కట్లు తప్పలేదు. మరోక వైపున నగర వ్యాప్తంగా సరఫరా అవుతున్న కలుషిత నీటితో పాటు తోపాటు ఎండల తీవ్రతకు నీరశించి,వాంతులు, విరోచనాల ప్రభావానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గన్నవరం: రోహిణి కార్తెలో రోళ్లు బద్దలవుతాయనేది నానుడి. అందుకు అనుగుణంగానే ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలే నమోదవుతున్నా తీవ్రత మాత్రం ఎక్కువగా ఉంది. సూర్యుడి భగభగలకు తోడు వేడిగాలులు వీస్తుండటంతో ఉక్కపోతతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఉదయం 8గంటల నుంచి ఎండ మండిపోతుండటంతో సాయంత్రం 7 గంటల తర్వాతే బయటకు వస్తున్నారు. ఇంట్లో ఉన్నప్పటికీ ఏసీలు, కూలర్లు వేసుకుంటేనే ఉండగలుగుతున్నారు. పశ్చిమ, వాయువ్య దిశల నుంచి రాష్ట్రంలోకి గాలులు వీస్తుండటం వల్ల గురువారం సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యింది. దీంతో కూడా వేడిగాలుల తీవ్రత, సూర్యుడి భగభగలు కొనసాగనున్నాయి. ఇళ్లపై ఉన్న ట్యాంకుల్లో ఉన్న నీరు సైతం వేడెక్కడంతో జనం అవస్థలు వర్ణనాతీతం.

వేడి గాలులతో సెగ

ఉదయం 8 గంటల నుంచి సూర్యుడు నిప్పులు చెరుగుతుండటంతో వాతావరణం త్వరగా వేడెక్కుతోంది. దీనికితోడు వేడిగాలులు ఉండడంతో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలే ఉన్నప్పటికీ తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. వేడిగాలులతో సెగ వస్తుండటంతో జనం బయట ఉండలేకపోతున్నారు. బయట తిరిగేవారు తరచూ శీతలపానీయాలు తాగుతూ సేదతీరుతున్నారు. కొంతదూరం ప్రయాణించగానే చెట్టు వస్తే కొంతసేపు ఆగుదామన్న ఆత్రుత వాహనదారుల్లో కనిపిస్తోంది. నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల్లోనూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వ జనసంచారం పెద్దగా ఉండటం లేదు. అత్యవసరమైతే తప్ప జనం బయటకు రావడం లేదు. ఎండ వేడి కంటే వేడిగాలుల తీవ్రత వల్ల ఉక్కపోతతో శరీరంలో నీటిశాతం తగ్గిపోయి తరచూ పానీయాలు తీసుకోవాల్సి వస్తోంది. మే నెల ప్రారంభంలో కొంత వర్షాలు వచ్చి ఎండలు తగ్గగా మళ్లీ క్రమంగా ఎండలు పెరిగి ఉక్కపోత పెరిగింది. వద్దులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు.విద్యుత్తు సరఫరాకు నిమిషాల సమయం అంతరాయ కలిగినా తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. శీతల కార్యాల ధరలు విపరీతంగా పెరిగాయి. కొబ్బరి బొండం ఒకటి నలభై రూపాయలు అమ్ముతున్నారు. జ్యూస్‌లు 50 నుంచి 60 రూపాయలు తీసుకుంటున్నారు. విద్యుత్ వాడకం పెరగడంతో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయి. కొన్ని ట్రిప్ అవుతున్నాయి.



ఆటలతో ఆరోగ్యం : చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఆటలు ఆరోగ్యాన్ని చదువు జ్ఞానాన్ని పెంచుతాయని ఉంగుటూరు గ్రంధాలయ శాఖాధికారి ఉప్పలపాటి చంద్రశేఖర్ అన్నారు. గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం మండల కేంద్రం గ్రంధాలయ శాఖ ఆధ్వర్యంలో పిల్లలకు పుస్తక పఠనం ద్వారా కథలు చదివించడం, మ్యూజికల్ చైర్,క్యారమ్స్,లూడో ఆటలు ఆడించడం జరిగింది. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞాన బాండాగారాలు అని ప్రపంచ దేశాలకు సంబంధించిన అన్ని రకములైన సమాచారం గ్రంధాలయంలో కొలువు తీరి ఉంటాయని దానిని అర్థం చేసుకుని అందరూ గ్రంధాలయ విజ్ఞాన సంపదను పఠనం చేయటం అలవరుచుకోవాలి అని తద్వారా సమాజం యొక్క పరిస్థితులు ప్రపంచ చరిత్ర అర్థమవుతుందన్నారు.

శిక్షణా శిబిరాలతో విజ్ఞానం

ప్రజాశక్తి-చల్లపల్లి: వేసవిలో విద్యార్థులకు ఆహ్లాదంతో పాటు విజ్ఞానం కోసం వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు చల్లపల్లి లైబ్రేరియన్ కే.గణేష్ కుమార్ అన్నారు. గురువారం చల్లపల్లి గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, చిన్నారులచే మ్యూజికల్ ఛైర్స్, లెమన్ అండ్ స్పూన్ ఆటలు ఆడించారు. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా విద్యార్థులచే పుస్తకాలు చదివించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



బందోబస్తుపై డిఎస్‌పి సమీక్ష

ప్రజాశక్తి-కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గం స్థాయిలో బందోబస్తుపై డిఎస్‌పి రజిని పెనమలూరులో పోలీసు అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా పెనమలూరు నియోజక వర్గ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆమె పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని, సెక్షన్ 144ను, 30 పోలీస్ యాక్టును కఠినంగా అమలు పరచాలని, నిబంధనలను అతిక్రమించే వారు ఎవరైనా వదిలి పెట్టవద్దని, సమస్యాత్మక గ్రామాలను పోలీసు అధికారులు తరచూ పర్యటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డీఎస్పీ సుభాష్, సిఐలు శ్రీనివాస్ (కంకిపాడు), రామారావు (పెనమలూరు), హబీబ్ బాషా (ఉయ్యూరు) తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. మాజీ గ్రంథాలయ ఉద్యోగి అవిర్నినేని వెంకటేశ్వరరావు, సాహితి స్రవంతి నిర్వాహకుడు లంకా సురేంద్రలు సర్వసతి దేవి, ఘంటశాల వెంకటేశ్వరరావుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించి చిన్నారులకు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో హాకర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. 54వ సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ హాకర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐక్యత – పోరాటం నినాదంతో 1970 , మే 30న ఏర్పడిన సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా, కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించే వేగుచుక్క అని సిఐటియు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సినియర్ నాయకులు కామ్రేడ్ ఎ.విఠల్‌రావు, హాకర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ బి.రమణమ్మ యూనియన్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇబ్రహీంపట్నం హాకర్స్ యూనియన్ (సిఐటియు) సభ్యులు నవీన్, రామారావు, అంజలి, ప్రభుదాస్ , మల్లేష్, దుర్గా, రత్న మణి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం : సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక నూజివీడు రోడ్‌లోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఐక్యత పోరాటం నినాదంతో సిఐటియు ఏర్పడిందని నిరంతరం కార్మికుల సమస్యల కోసం సిఐటియు నిర్విరామంగా పోరాటం చేస్తుందని అన్నారు. సిఐటియు మండల కమిటీ సభ్యురాలు పత్తిపాటి జ్యోతి, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు సిఐటియుజండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వీరమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కే రమణ, విజయ, వెంకమ్మ ముఠావర్కర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద గురువారం సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా సిఐటియు ఆవిర్భావం, సిఐటియు ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ రామనాథం, వివి రాంప్రసాద్, పారా ఎలకమ్మ, రావెళ్ళ శేషు, మున్సిపల్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** సిఐటియు


నందిగామలో...

ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ముం దు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రెసిడెంట్ చాపలమడుగు నాగరాజు ఆవిష్కరిచారు. అనంతరం పర్సా సత్యనారాయణ చిత్ర పటానికి ఉపా ధ్యక్షులు సామ్రాజ్యం పూలదండ వేసిన నివాళులర్పిం చారు. ఈ కార్యక్రమం సిఐటియు మండల కార్యదర్శి బి.వేంకటేశ్వరరావు, యూనియన్ కార్యదర్శి మోదుగు సురేష్, ఉపాధ్యక్షులు రమణ, నాయకులు కష్ణవేణి, కార్మికులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామలో సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాఘవాపురం – పల్లగిరి ఆటో స్టాండ్ వద్ద జెండా ఆవిష్కరించారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ ఖాసిం, జి.గోపినాయుక్ , బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ హుస్సేన్ , ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు అనిల్ , ఏసోబు, పుల్లయ్య, నాగేశ్వరరావు, జాన్ మీరా తదితరులు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాలను సిఐటియు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కార్మికులు సమస్యలపై పోరాడుతూ వారికి సిఐటియు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అంకుల్, నరసింహారావు, తిరుపతిరావు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విజయవాడ అర్బన్ : సిఐటియు 54వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు పటమట ఈసేవా కేంద్రం వద్ద గురువారం ఉదయం ఘనంగా జరిగాయి.


ఇబ్రహీంపట్నంలో


పెనుగంచిప్రోలులో

ఈసందర్భంగా సిఐటియు విజయవాడ తూర్పు నగర అధ్యక్షులు వి.బి.రాజు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ సిఐటియు కార్మిక పక్షపాతి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని నీరుగారుస్తున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు వి.గురుమూర్తి, పి.రాజు, శివ, కృష్ణ, ముని, భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్లుపాల్గొన్నారు.

బెంజిసర్కిల్ వద్ద

బెంజిసర్కిల్ వద్ద గల కార్మికుల అడ్డా వద్ద సిఐటియు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు విజయవాడ తూర్పు సిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు సిటీ బిల్డింగ్ ఆఫీసర్ బేరర్స్ ఎం.నాగమల్లేశ్వరరావు సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు వి.బి. రాజు మాట్లాడుతూ కలకత్తా నగరంలో మే 30వ తేదీన బిటి.రణదీవె అధ్యక్షతన సిఐటియు ఆవిర్భవించిందన్నారు. కార్మికుల రోజువారీ వేతనం, భద్రత, హక్కులు, కార్మిక పక్షపాతిగా ప్రత్యక్షంగా పరోక్షంగా దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా సిఐటియు ఉందన్నారు. ఈకార్యక్రమంలో బి.దుర్గారావు, వి.రాంబాబు, ఆర్.రామకృష్ణ, ఆర్.నరసింహారావు, కె.రాజు, ఎస్.దుర్గారావు, వి.నాగరాజు పలువురు స్థానికులు పాల్గొన్నారు.


మొక్కలు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

నీటి కుంటల ఒడ్డున మొక్కలు సురక్షితం

ప్రజాశక్తి - గంపలగూడెం: నీటి కుంటల ఒడ్డున పండ్ల మొక్కలు నాటితే మంచి ఫలితాలను ఇస్తాయని గంపలగూడెం మండల ఉపాధి హామీ అధికారి వేల్పుల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండలంలోని, కనుమూరు, అనుములంక, వినగడప గ్రామాల్లో నీటి కుంటల ఒడ్డున కొబ్బరి, జామ, సపోటా, నేరేడు, తదితర మొక్కలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల ఉపాధి హామీ పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ పనులు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేర ఈ పనులు చేపట్టామని తెలిపారు. గ్రామాల్లో రైతుల పొలాల్లో మొదటగా, నీటి కుంటలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతుల అనుమతి మేరకు రెండు నుండి మూడు ఎకరాలకు ఒక నీటి కుంటను ఏర్పాటు చేస్తే, ఆ చేలల్లో పంట సుభిక్షంగా ఉంటుందన్నారు. నీటి ఎద్దడి సమయంలో ఆయా భూములకు సమస్యలు అంతగా తలెత్తవు అన్నారు. రైతులు ఈ పరిస్థితులను అర్థం చేసుకొని అందరూ నీటి కుంటల ఏర్పాటుకు సహకరించాలని వెంకటేశ్వర్లు కోరారు.


పాడైన వంతెన

శిథిలావస్థలో వంతెన రెయిలింగ్


ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రం దళితవాడను కలిపుతూ ఉన్న రెండు ప్రధాన వంతెనల్లో ఒక వంతెన పూర్తిగా పాడైపోయి శిథిలావస్థలో ఉండగా మరొక వంతెన రెయిలింగ్ పాడైపోయి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన రెయిలింగ్ శిథిలమై ఏడు సంవత్సరాలుగా కొద్ది కొద్దిగా కూలిపోతూ ఉంది. ఈ ప్రాంతంలో ప్రజల రాకపోకల తాకిడితో రద్దీగా ఉంటుంది. దీంతో ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనుక ఈ రెండు వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడ సూర్యారావుపేట వాస్తవ్యులు కునుగొండ్ల దినేష్ స్వామి వారి దేవస్థానంలో నిత్య అన్నదాన పథకానికి రూ.10,116లు విరాళం అందించారు. దాతలకు స్వామిప్రసాదం అందించారని ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, సహాయ కమిషనర్ సి జయప్రకాష్ బాబు తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి - తిరువూరు : రైతు భరోసా కేంద్రాల్లో (అర్‌బికె) ప్రతి రోజూ రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పి.పద్మ అర్‌బికె కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో ఆమె తిరువూరులోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ఎఒ సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 2024 సీజనుకు సంబంధించి అర్‌బికెలకు కావలసిన ఎరువులు, విత్తనాల ఇండెంట్ ఇవ్వాలని తెలిపారు. ప్రతి రోజూ సిబ్బంది ఆఫీస్ సమయంలో మీ యొక్క అర్ బికె, సచివాలయాల్లో తప్పని సరిగా రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి పి.పద్మ

జంక్ ఫుడ్ వల్ల అనర్థాలు

ప్రజాశక్తి - మైలవరం : నేటి కాలంలో జంక్‌ఫుడ్ తినడం వలన అనేక అనర్థాలు వస్తున్నాయని జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ వెల్వడం భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు జెడ్.నరసింహారెడ్డి పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు బొమ్మలాట, బాలల కథల, గురించి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ సమయంలో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

విజయవాడ : ఈ రోజు ఠాగూర్ గవర్నర్ పేట, బందర్ రోడ్, విజయవాడలో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు దంత సంరక్షణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుదంతా దంత వైద్యశాల డెంటిస్ట్ డాక్టర్ సిహెచ్.నారాయణరావుతో విద్యార్థులకు గల దంత సమస్యల గురించి దంతాలను ఎలా కాపాడుకోవాలనే విషయాలు మీద డాక్టర్ చక్కగా వివరించారు. విద్యార్థులు బ్యాక్టీరియా గల చాక్లెట్స్ కేకులు మొదలైనవి తిన్నా కూడా తిన్నప్పుడు శుభ్రంగా క్లీన్ చేసుకుంటే దంతాలకు ఎటువంటి బ్యాక్టీరియా ఏర్పడకుండా ఎక్కువ కాలం మన్నిక ఉంటాయని తెలిపారు. చిన్నతనంలో వచ్చే పాల దంతాలు గురించి వాటిని ఏ విధంగా కాపాడుకోవాలో వివరించారు. ఠాగూర్ గ్రంథాలయ అధికారిణి కే.రమాదేవి శాలువా , జ్ఞాపికతో డాక్టర్ సత్యనారాయణ రావును సన్మానించారు.

పలు కార్యక్రమాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంచాలకుల ఆదేశానుసారం పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులు మొదటగా పుస్తక పఠనం అబ్దుల్ కలాం జీవిత చరిత్ర చదివి వినిపించారు. జనరల్ నాలెడ్జి ప్రశ్న, జవాబులు అడిగి విద్యార్థులచే చెప్పించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు వినోద్ కుమార్ ఆంగ్లం హ్యాండ్ రైటింగ్ నేర్పించారు. తదుపరి విద్యార్థులు పాటలతో డాన్స్ చేసి ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, మణిరత్నం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో...

డాన్స్‌లో శిక్షణ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల, శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారం 30 రోజు కొనసాగింది. ఈ క్యాంపులో నర్సరీ నుండి పదో తరగతి


గంపలగూడెం గ్రంథాలయంలో...

చదివే విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ బిట్ర రాహుల్ కుమార్ విద్యార్థులకు డాన్స్‌పై శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు విద్యార్థులకు బటర్ ఫ్లై (సీతాకోకచిలుక) బొమ్మ డ్రాయింగ్ నేర్పించారు. ఆయుష్ డిపార్ట్ మెంట్ నుండి యోగా మాస్టర్ మేడూరి మాణిక్యాలరావురావు యోగాసనాలు విద్యార్థులకు నేర్పించారు. ఎం.కనకారావు విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ నేర్పించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. చెస్, షటిల్, టెన్నికాయిట్ ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్–2 గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

తేలిక పద్ధతిలో డ్రాయింగ్‌కు శిక్షణ

ప్రజాశక్తి - గంపలగూడెం : విద్యార్థులకు తేలిక పద్ధతిలో డ్రాయింగ్, వాటిపై సమీక్ష నిర్వహించినట్లు పెనుగొలను గ్రంథాలయ శాఖ ఇన్‌ఛార్జ్ శ్రీలత తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా, గురువారం విద్యార్థులకు పలు పుస్తక పట్టణాలతో పాటు మెలకువలు తెలిపారు. గంపలగూడెం గ్రంథాలయ శాఖలో విద్యార్థులకు క్యారమ్స్‌తో పాటు వివిధ కథల పోటీలు ఏర్పాటు చేసినట్లు సుంకర నాగేశ్వరరావు వివరించారు.



విజయవాడ ప్రభాస్ కళాశాల వద్ద...



బందరులో...

పలుచోట్ల సిఐటియు పతాకావిష్కరణలు

ప్రజాశక్తి-విజయవాడ: సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నగరంలోని సెంట్రల్ నియోజకవర్గంలో గురువారం ఆయా ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. సిఐటియు జెండా ఆవిష్కరణలు, కేక్ కట్ చేసి కార్మికవర్గానికి శుభాకాంక్షలు తెలపడం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని ప్రభాస్ కాలేజీ ఆటో స్టాండ్, బిఆర్‌టిఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు సిఐటియు సిటీ భవన్, సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభాస్ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో సిఐటియు జెండాను ఆటో వర్కర్స్ యూనియన్ స్టాండ్ అధ్యక్షులు ఎస్. కె.బాజీ ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు కేక్ కట్ చేసి, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. నండూరి ప్రసాదరావు భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సి. హెచ్ మహేష్ కుమార్ జెండాను ఆవిష్కరించగా, సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ఎపి సిఆర్‌డిఎ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు కె గోపాలరావు జెండాను ఆవిష్కరించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమానుద్దేశించి యూనియన్ నగర అధ్యక్షులు కె దుర్గారావు మాట్లాడుతూ...కార్మికవర్గానికి వేగు చుక్క సిఐటియు అని అన్నారు. సిఐటియు ఏర్పడిన దగ్గర నుంచి కార్మికవర్గానికి అండగా నిలుస్తూ వచ్చిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన ఘనత సిఐటియు కే దక్కుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక చట్టాలను కాపాడుకోవడం కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో విజయవాడ సెంట్రల్ సిటీ సి.ఐ.టి.యు ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. హనుమంతరావు, ప్రభాస్ కాలేజీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫరీద్, స్టాండ్ సభ్యులు షేక్ సర్దార్, సందక శేషు, ఆరవ అనిల్ కుమార్, డి .కాలేశ్వరరావు తదితరులు పాల్గొనగా, ఎన్‌పిఆర్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి యం.బాబురావు,టి. ప్రవీణ్, టి.ప్రభుదాస్, మెడికల్ రిప్స్ నాయకులు నాగుర్ వాలీ పాల్గొన్నారు. అలాగే సిఆర్‌డిఎ వద్ద జరిగిన కార్యక్రమంలో సిఆర్‌డిఎ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి సిహెచ్ నరసింహారావు, కోశాధికారి రమణారావు, నాయకులు టి ప్రభుదాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడివాడ: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు 1970 మే 30వ తేదీన కలకత్తాలో ఆవిర్భవించిందని తెలిపారు. భారతదేశంలో వర్గ రాజకీయ సిద్ధాంతాన్ని కాపాడటంలో ఒక చారిత్రాత్మకంగా సిఐటియు ఏర్పడిందన్నారు. ఆనాటి నుంచి వర్గ పోరాట సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్మికులు, కర్షకులు ఐక్యతగా ఉండి ఉద్యమాలు చేస్తూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని, వృత్తి సంఘం జిల్లా కన్వీనర్ సిహెచ్.శివ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రేపాని కొండ, బి.అరుణ, వీరమ్మ, ప్రభుదాస్, రాంబాబు, యెషయ్యా, నాగేశ్వరరావు, వై.వి



గుడివాడలో...

సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: కంకిపాడు బస్టాండ్ వెనుక గల సిఐటియు కార్యాలయం వద్ద రిక్షా వర్కర్స్ యూనియన్ నాయకులు జి.రెడ్డి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి తాడంకి నరేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను, కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మిక సంఘాలు చేపట్టే ఉద్యమాలను అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు జి.కుమారి, వి.వెంకటేశ్వరరావు, శ్రీధర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సుకేష్ పాల్గొన్నారు.



కంకిపాడులో...

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కనీస వేతనం అమలు, సమాన పనికి సమాన వేతనం, కార్మికుడికి కార్మికులకు శ్రమకు తగ్గ ఫలితం కోసం నిరంతరం పనిచేస్తున్న సంఘం సిఐటియు అని సిఐటియు కృష్ణాజిల్లా కోశాధికారి బూర. సుబ్రహ్మణ్యం అన్నారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం కోనేరు సెంటర్లో మచిలీపట్నం తాలూకా లారీ ఎగుమతి దిగుమతి ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బూర. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కులకై ఉద్యమిస్తున్న సంఘం సిఐటియు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న సంఘం సిఐటియు అన్నారు. స్కీమ్ వర్కర్ల కనీస వేతనాలు అమలు చేయాలని రాష్ట్రంలో శాంపియన్ పోరాడుతున్న సంఘం సిఐటియూ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి సి హెచ్.జయరావు ,బిల్డింగ్ యూనియన్ జిల్లా నాయకులు వి. వి రమణారావు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎండి యూనస్ ,ముఠా యూనియన్ ఉపాధ్యక్షులు గోళ్ళ రామకష్ణ, కార్యదర్శి కొనతం వెంకటేశ్వరరావు.కోశాధికారి కోలుసు దిలీప్,తదితర ముఠా కార్మికులు పాల్గొన్నారు.

కాల్వల మరమ్మతులు శూన్యం : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఇరిగేషన్, డ్రైనేజీ పనులకు ముందస్తు ప్రణాళిక లేకుండా వైసీపీ ప్రభుత్వం రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తుందని మాజీ ఉపసభాపతి అవనిగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ విమర్శించారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు ప్రతీ వేసవికాలంలో పంట కాలువలు మురుగు కాలువల మరమ్మతులు జరిపించాల్సి ఉందని దానికోసం ముందుగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల కోడ్ రాక పూర్వమే టెండర్లు పిలవకపోవడం చూస్తుంటే వైసీపీ ప్రభుత్వానికి రైతుల పట్ల మమకారం లేదని స్పష్టమవుతుందన్నారు. మురుగు కాలువలన్నీ గుర్రపు డెక్క తూటు కాడతో నిండిపోయాయన్నారు. కొద్దిపాటి వర్షాలు కురిసిన పొలాలు ముంపుకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. గతే.డాది మంజూరైన ఇరిగేషన్ పనులు పూర్తి చేయలేదని పులిగడ్డ ఆక్విడెక్ట్ మరమ్మత్తులు నేటికీ చేపట్టలేదని గుర్తు చేశారు. పనులు చేయని కాంట్రాక్టర్‌పై సైతం ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కోతకు గురైన కష్ణా కరకట్టల మరమ్మత్తుల సైతం కాంట్రాక్టర్లు పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని బుద్ధ ప్రసాద్ ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలుగా ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ప్రభుత్వ నిర్వాహకం వల్ల ఈ ఏడాది పనులు చేసే పరిస్థితి కూడా లేదని ఫలితంగా దివిసీమ రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని బద్ధ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి కేశవరావు

నాణ్యమైన విత్తనాలు అందించాలి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు

ప్రజాశక్తి-గుడివాడ: రుతుపవనాలు సకాలంలో వస్తే వ్యవసాయ సీజన్ మంచిగా ప్రారంభమవుతుందని, అందుకు తగ్గట్లుగా రైతులకు నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వం అందించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు కోరారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో కృష్ణాజిల్లా రైతాంగ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలు చాలా కాలంగా మరమ్మతు లేకుండా మెయింటెన్స్ వర్క్ లేకుండా ఉన్నాయన్నారు. వాటిని మరమ్మతు చేయకపోతే రైతాంగం సాగునీటికి ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. గత సీజన్లో తుపానుకు నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు ఇంకా నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. వచ్చే ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దృష్టిలో బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కౌలు రైతులందరికీ కౌలు కార్డులు ఇచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు కూడా సకాలంలో అందించాలన్నారు. రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కూడా జూన్ నుంచే ప్రారంభమవుతుందని, నాణ్యమైన విత్తనాలను చిన్న సన్నకారు ప్రతి రైతుకి కూడా అందించాలన్నారు. విత్తనాలు కూడా కొంతమందికి ఇచ్చారు కానీ ఇంకా చాలామంది రైతులకు అందలేదని, వాళ్లకు కూడా అందించాలని కోరారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం అవనిగడ్డలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ విభాగాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల చేత పుస్తక పఠనం కథలు చెప్పడం చదివించడం చిత్రలేఖనం తెలుగు పద్యాలు ఆటలలో తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం శేషగిరిరావు, జి.నవ్య సాయి తదితరులు పాల్గొన్నారు. అధికారి జే ప్రభుదాస్, సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.





విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-పెదపారుపూడి: పెదపారుపూడి గ్రేడ్-3 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, నీతి కథలు చెప్పారు. విద్యార్థులచే కథలు చెప్పించారు. ఆశ వర్కర్ ఎన్.రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత అలవరచు కోవాలని, చేతుల గోర్లలోమట్టి, మురిగి పోకుండా చూసుకోవాలని, వేసవిలో మంచి నీరు, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగాలని, కాటన్ వస్త్రాలు ధరించాలని అన్నారు. అనంతరం హౌసీ, చెస్, క్యారమ్స్ ఆటల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎంవీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలల గుర్తింపునకు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు బడి బయట ఉండకుండా వారి కోసం ఏర్పాటు చేయబడ్డ భవిత సెంటర్లలో చేర్పించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షణ కృష్ణాజిల్లా సహిత సమన్వయకర్త ఏడుకొండలు తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు 40 రోజుల పాటు రిసోర్స్ పర్సన్ తో కలిసి మండలంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా గురువారం రెండో వార్డులోని అంగన్వాడీ కేంద్రం వద్ద ఏడుకొండలతో పాటు ఎంఈఓ 2 అన్నపురెడ్డి పిచ్చయ్య విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్క వికలాంగ విద్యార్థిని పాఠశాలలో చేర్పించే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సమీపంలోని పాఠశాలలో గాని భవిత సెంటర్లలో గాని తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. ఫిజియోథెరపీ క్యాంపులు హోం టెస్ట్ విద్య డిజిటల్ విద్యలో భాగంగా ట్యాబులు ఉచిత ఉపకరణాలు పంపిణీ వివిధ రకాల అలవెన్సులు మొదలగు రాయితీలు అందిస్తున్నామని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎంఈఓ పిచ్చయ్య మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్షణ ద్వారా అనేక సదుపాయాలు కలుగుతాయని అందువల్ల తల్లిదండ్రులు చిన్నపాటి వైకల్యం ఉన్న విద్యార్థులను భవిత సెంటర్లలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ టిపి నాగదుర్గ, జి నాగమణి పాల్గొన్నారు.



ప్రీపెయిడ్ కస్టమర్లకు 'వి' ప్రత్యేక ఆఫర్లు


ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రీపెయిడ్ యూజర్ల కోసం ప్రముఖ టెలికం ఆపరేట్ వి నెట్‌ఫ్లిక్స్‌తో భాగస్వామ్యం ఏర్పాటుచేసుకోవడం ద్వారాపలు ఆఫర్లను అందిస్తుందని సంస్థ ప్రతినిధి కె.ఎం.ఎస్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వలన వి యూజర్లు తమకు ఇష్టమైన ఏ డివైజ్‌లో అయినా అంటే మొబైల్, టీవీ లేదా ట్యాబ్లెట్‌ను వినియోగించి మంచి ఆఫర్లు పొందవచ్చని తెలిపారు. త్వరలో నెట్‌ఫ్లిక్స్‌తో బండిల్ చేసిన పోస్టుపెయిడ్ ప్లాన్‌లను కూడా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. నెట్‌ఫ్లెక్స్‌ను మొబైల్ అలాగే టీవీలో కూడా చేసేందుకు వీలు కల్పించే విధంగా బేసిక్ సబ్‌స్క్రిప్షన్‌తో అపరిమిత కాల్స్ అండ్ డేటాను ఆఫర్ చేసి రెండు కొత్త అన్‌లిమిటెడ్ ప్రీ ఫెయిడ్ ప్యాక్‌లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

రక్తపోటుపై అవగాహన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : రక్తపోటుపై ప్రతి ఒక్కరికీ అవగాహన అత్యంత అవసరమని గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ హెడ్ అశోక్ మాలిక్ అన్నారు. రక్తపోటుపై అవగాహనా కార్యక్రమం గురువారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లెన్‌మార్క్ ఆధ్వర్యంలో 250కి పైగా నగరాలు, పట్టణాల నుండి వెయ్యి మంది వైద్య నిపుణులతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంలో వివిధ కార్యక్రమాలను ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో మానసిక ఒత్తిడి, పలు ఆహారంలో నియంత్రణ లేకపోవడం, వంటి వివిధ కారణాల కారణంగా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు రక్తపోటు నియంత్రణ ఏవిధంగా చేయాలో కూడా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డు కార్యక్రమం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ గుణదల మెట్రో పాలిటన్ చర్చ్‌లో హల్లెల్ సంగీత స్కూల్ వారి ఆధ్వర్యంలో ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యేషువా బెత్ హల్లెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ దండి%శీ%గి ఆగస్టీన్ అధ్యక్షతన నిర్వహించారు. ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డు, ఇంటర్నేషనల్ అచీవర్స్ రికార్డులో భాగంగా దాదాపుగా 400 మంది సంగీత కారులతో కీబోర్డ్, గిటార్ వాయిద్యాలతో దేవుని పాటలు నిరంతరాయంగా దాదాపుగా కొన్ని గంటలపాటు ఆలపించారు ఈ కార్యక్రమం ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డు చీఫ్ అడ్జుడికేటర్ ఆనంద్ రాజేంద్రన్, ఫౌండర్ బిందు ప్రియాంకలు స్వయంగా పర్యవేక్షించి ఈ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారని తెలిపారు. అనంతరం దండింగి ఆగస్టీన్ మాట్లాడుతూ ఈ రికార్డు సొంతం చేసుకున్నందుకు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ స్కూల్ ఆధ్వర్యంలో సుమారుగా ఇప్పటికీ 5600 మందికి ఉచితంగా తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. గతంలో కుడా స్టార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ మరియు ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించమన్నారు. భవిష్యత్తులో దేవుని కపతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూడా సాధిస్తామని తెలిపారు. ఈ సంగీత కార్యక్రమంలో భాగంగా కొమ్ము బూరలు ఊది ఆయన అందరినీ ఆకర్షించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రిన్సిపాల్ హెప్సిబా గ్రేస్, స్టాఫ్ ఎజ్రా శాస్త్రి, శ్రీకాంత్ దేవ్, షైనీ హవీలా, దుష్యంత్, సునీల్ జాన్ విలియమ్స్, దెబోరా, చార్లీ, నాన్సీ ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు.



రికార్డు అందుకుంటున్న దృశ్యం

ఎండలతో బెంబేలు

- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు - 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - మైలవరం : రోహిణి కార్తెలో రోళ్ళు పగిలే ఎండలు వేస్తాయని నానుడి. ఆ నానుడిని నిజం చేస్తూ వేస్తున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మూడు రోజుల నుండి 40 డిగ్రీలు పైగానే ఉష్ణోగ్రతలు ఉండటంతో మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు ఎండల వేడిమికి తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు. వారం క్రితంతుఫాను ప్రభావంతో చిన్నపాటి జల్లులు పడటంతో ఆ జల్లులు ప్రభావం వల్లే ఎండలు మండుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మైలవరంలో నిత్యం రద్దీగా ఉండే పోస్ట్ ఆఫీస్ రోడ్, నూజివీడు రోడ్, విజయవాడ రోడ్, పొందుగుల రోడ్లలోని పలు షాపులు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 9 గంటలకే సూర్యుడు సుర్రుమనటంతో ఇంటికే పరిమితమవుతున్నారు. రోజువారి పని వారు కూడా టారెత్తిస్తున్నఎండలను చూసి ఇంటి వద్ద గడుపుతున్నారు. ఎండలకు తోడు వేడి గాలులు వీచటంతో రహదారులపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని దీంతో పలు శుభకార్యాలకు కూడా వెళ్లలేక పోతున్నామని పలువురు వాపోతున్నారు. ఎండల వేడిమి నుండి తట్టుకునేందుకు కొంతమంది శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. మరోవైపు ఏసీలు కూడా రెండు మూడు గంటల వరకే పనిచేస్తున్నాయని అటు తర్వాత ఏసీల నుంచి కూడా వేడి గాలులు వస్తున్నాయని అంటున్నారు. సాయంత్రం 6 గంటలు దాటుతున్నా వేడి గాలులు రావడంతో పనులు కూడా చేసుకోలేకపోతున్నామని ఇళ్ళకే పరిమితం కావలసి వస్తుందని మైలవరానికి చెందిన నాగరాజు అంటున్నాడు. కొంతమంది ఎండ వేడిమి నుండి రక్షణ పొందేందుకు ముఖానికి మాస్కులు, కర్చీపులు, గొడుగులు వాడుతున్నారు. ఏది ఏమైనా మరో నాలుగు ఐదు రోజులపాటు వేడి గాలులు ఎండలు, అధికంగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.


మైలవరంలో నిర్మానుష్యంగా విజయవాడ ప్రధాన రహదారి

స్వచ్ఛమైన మంచినీరివ్వాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన గురువారం నగరంలోని గొల్లపాలెం గట్టు పంపింగ్ బూస్టర్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ గత కొంతకాలంగా 11 ఎంజిడి ప్లాంట్ నుండి రంగు మారి పసుపు రంగులో మంచినీరు సరఫరా కావడంతో పలువురు అనారోగ్యాలకు గురవుతున్నారని వివరించారు. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. మురుగు కాల్వలో ఉన్న మంచినీటి పైపులను తొలగించి లీకేజీలను అరికట్టాలని, మేకలవారి వీధి, ఆలేటివారి వీధి కొండ ప్రాంతాల్లో మంచినీటి కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. మహంతిపురం దాసాంజనేయ వీధి పైప్‌లైన్ ఇంటర్ కలెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్ ప్రజలకు తగినంత మంచినీరు అందించేందుకు మరో మంచినీటి రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని గత ఏడాది కౌన్సిల్లో ప్రతిపాదన పెట్టినట్లు గుర్తుచేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్లో ఇటువంటి ముఖ్యమైన అంశాలపై ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం వల్లే నేడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నగర మేయర్, ప్రజాప్రతినిధులకు ఓట్లపై ఉన్న శ్రద్ధ ప్రజల ఇబ్బందులపై పెట్టడంలేదన్నారు. వేసవి ముందస్తు చర్యల్లో భాగంగా ఫిబ్రవరి, మార్చిల్లో చేయాల్సిన కొత్త పైప్ లైన్లు, పాడైపోయిన పైప్‌లైన్లు, బోరింగ్‌ల మరమ్మతుల్లో తీవ్ర నిర్లక్ష్యం వైఖరి ప్రదర్శిస్తున్నారని అన్నారు. తగినంత ఇంజినీరింగ్ సిబ్బందిని నియమించడంలో ఘోరంగా విఫలమయ్యారని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఇవి నారాయణ, ఎం.కొండారెడ్డి, పి.రాజు, జి.బాల దుర్గారావు, సిహెచ్.దుర్గారావు, కె.లక్ష్మణ, ఎ.శ్రీనివాస్, ఎన్.గురప్ప, ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు కే.వరలక్ష్మి, బి.రమణ, పి.శ్రీను పాల్గొన్నారు. మంచినీటి సమస్యలను జోనల్ కమిషనర్, వాటర్ సప్లై డిఇ, ఎఇల దృష్టికి సిపిఎం నేతలు తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం సిబ్బందిని పంపి లీకేజ్ నివారణ పనులు చేపట్టారు.


నీటి పైపులను పరిశీలిస్తున్న సత్యబాబు

ఉత్తమ ఫలితాల సాధనలో అగ్రగామి శ్రీ అక్షర

విద్యా సంస్థల చైర్మన్ శ్రీ రామ్

ప్రజాశక్తి - నందిగామ : ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులు అగ్రగామిగా నిలవటంలో శ్రీ అక్షర విద్యాసంస్థల చైర్మన్ గడుపూడి శ్రీ రామ్, జ్యోతి అన్నారు. నందిగామ, కంచికచర్ల లో శ్రీ అక్షర విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. అనతి కాలంలోనే అధ్యాపకులు కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారంతో తెలుగు, ఇంగ్లీష్ మీడియం అక్షర టెక్నో స్కూల్, జూనియర్ కాలేజి, డిగ్రీ కళాశాలలు, సువిశాలమైన స్వంత భవనాలు, ఎసి క్యాంపస్ డిజిటల్ విద్యా బోధన, శ్రీ అక్షర ప్రైమ్ ఎసి క్యాంపస్, శ్రీ అక్షర వాగ్దేవి క్యాంపస్ పేరుతో నిర్వహిస్తూ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి క్యాంపస్‌లోను ఐఐటి, జెఇఇ, నీట్ అధ్యాపకుల పర్యవేక్షణలో ప్రణాళిక బద్ధమైన మైక్రో షెడ్యూలింగ్ ప్రోగ్రామ్ ద్వారా విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. సువిశాలమైన ఎసి క్యాంపస్‌లో సెక్షన్‌కు 30 మంది విద్యార్థులు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రతి ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తి గత శ్రద్ధ, వారి రక్షణ కొరకు సిసి కెమెరా ద్వారా పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. విద్యతో పాటు ప్రతి రోజు సాయంత్రం క్రీడలు, ఆసక్తి కలిగిన వారిని ప్రోత్సహించటం, విద్యార్థులలో పోటీతత్వం, ఫిజిక్స్, మ్యాథ్స్ ఎంపవర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంత విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉందన్నారు. చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఉందని తెలిపారు. జెఇ మెయిన్స్, ఆంధ్ర, తెలంగాణ ఎంసెట్ ఎంట్రన్స్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




ఫ్లోరైడ్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గంపలగూడెంలో ఫ్లోరైడ్ పరీక్షలు

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల కేంద్రమైన గంపలగూడెంలో ఫ్లోరైడ్ పరీక్షలు నిర్వహించినట్లు ఈవో జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజల ఆరోగ్య సౌకర్యార్థం ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గురు వారం స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎం.గోపాల్, జి.నాగేశ్వరరావు గ్రామ వ్యాప్తం గా ఉన్న బోరుబావుల్లో ఉన్న నీటిని పరీక్షిం చారు. పలుచోట్ల గ్రామస్తులను ఫ్లోరైడ్ ఉన్న నీటిని స్వీకరించవద్దని, ఆ నీటి ద్వారా రోగాలు బారిన పడే పరిస్థితిలో ఉన్నట్లు హెచ్చరించారు.

తప్పుగా కేసు నమోదు

ప్రజాశక్తి - కంచికచర్ల : నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై అనుమానాస్పదంగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. కంచికచర్ల నంబూరి వారి బజారులో నివాసముంటున్న తోటకూర వెంకటేశ్వరరావు (74) ఇంటి ఆవరణలో ఉన్న నీటి కుంటలో (స్లంపు)పడి మృతి చెందాడు. వెంకటేశ్వరరావు బిఎస్‌ఎన్‌ఎల్‌లో లైన్‌మేన్‌గా పనిచేస్తూ 15 సంవత్సరాల క్రితం పదవి విరమణ చేశాడు. ఇతనికి ఇరువురు కుమార్తెలు పెద్ద కుమార్తె పద్మావతి వద్ద హైదరాబాదులో ఉంటున్నారు. పెన్షన్ కోసం కొద్ది రోజుల క్రితం కంచికచర్లలోని తన నివాసానికి వచ్చాడు. స్నానం చేయటం కోసం తన ఇంటి అవరణలో ఉన్న నీటికుంట (స్లంపులో) ఉన్న నీటిని తీసుకోవటం కోసం వంగగా పొరపాటున జారీ నీటి కుంటలో పడి మృతి చెందాడు. కుమార్తె ఉండి పద్మావతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.